# వారెంటీ లేని గ్యారెంటీలను నమ్మొద్దు



మరిపెడ పట్టణ శివారులో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్, చిత్రంలో మంత్రి సత్యవతి, ఎంపీ కవిత, నూకల నరేశ్‌రెడ్డి

- అధికార దాహంతో కాంగ్రెస్ అడ్డగోలు హామీలు
- రత్నాల కేసీఆర్ పాలన ఉండగా.. నత్త గుల్లలెందుకు?
- రెడ్యానాయక్ లోకల్,.. సమష్టిగా పనిచేసి భారీ మెజార్టీతో గెలిపిస్తాం..
- మంత్రి సత్యవతి రాథోడ్

మరిపెడ, నవంబర్ 8 : వారెంటీ లేని కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలను ప్రజలు నమ్మొద్దని రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలో బీఆర్ఎస్ డోర్నకల్ అభ్యర్థి, ఎమ్మెల్యే రెడ్యానాయక్ నామినేషన్ అనంతరం ఎంపీ, జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో ఉనికి కోల్పోయిన కాంగ్రెస్ అధికార దాహం కోసం చేసే గ్యారెంటీలను ప్రజలు నమ్మరని తెలిపారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన జాతీయ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందన్నారు. తెలంగాణ సాధన మొదలు, విభజన హామీల వరకు కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు ఇప్పటి వరకు నోరువిప్పడం లేదన్నారు. దోపిడీకి గురవుతున్న తెలంగాణ వనరులను కాపాడేందుకే కేసీఆర్ 14 ఏళ్ల పాటు ఉద్యమం చేసి, ప్రాణ త్యాగానికి సిద్ధపడి రాష్ట్రాన్ని సాధించారని అన్నారు. రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు 24 గంటల ఉచిత కరెంట్, పంట పెట్టుబడి కోసం రైతుబంధు, పుష్కలంగా సాగునీళ్లు అందజేసిన ఘనత దేశంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సాగురంగంతోపాటు కులవృత్తిదారులకు సైతం పల్లెల్లోనే ఉపాధి కల్పించి, పూర్వవైభవం తెస్తున్నట్లు తెలిపారు. మత్స్యకారులు, గొల్లకుర్మలు, గీత, చేనేత, నాయీబ్రాహ్మణ, రజక తదితర కుల వృత్తిదారులకు అందుతున్న సంక్షేమంతో వారి కుటుంబాల్లో ఆనందం నెలకొందన్నారు. రూ.10 లక్షలతో దళితబంధు పథకంతో అణగారిన వర్గాల జీవితాల్లో గణనీయమైన మార్పు రానున్నదని తెలిపారు. మళ్లీ అధికారంలో రాగానే ఇంటింటికీ సన్నబియ్యం, రూ.400కే వంట గ్యాస్, రూ.16 వేల రైతుబంధు, రూ.5లక్షల కేసీఆర్ బీమా, రూ.5016లు ఆసరా పింఛన్లు అందజేస్తామని, బీఆర్ఎస్ ప్రభుత్వానికి నిండైన దీవెనలు అందించాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే రెడ్యానాయక్ లోకల్ అని, ఎప్పుడూ అందుబాటులో ఉండే నేతని అన్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి రెడ్యాను భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇద్దామన్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ల కేటాయింపులోనే గందరగోళానికి గురై స్థానికేతరుడిని బరిలోకి దింపి పరువు పోగొట్టుకున్నదన్నారు. వందకు పైగా స్థానాలను గెలిచి ముడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి స్పష్టం చేశారు.



మరిపెడలో రెడ్యా నామినేషన్ అనంతరం భారీ ర్యాలీగా వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

### ఆంజనేయుడు లేని ఊరు.. కేసీఆర్ సంక్షేమం అందని ఇల్లు లేదు : ఎంపీ కవిత

సీఎం కేసీఆర్ సుభిక్షమైన పాలనలో ఆంజనేయుడి విగ్రహం లేని గ్రామం, సీఎం కేసీఆర్ సంక్షేమ పథకం అందని ఇల్లు లేదని ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత అన్నారు. సీఎం కేసీఆర్ కేవలం తొమ్మిదేళ్ల కాలంలోనే తెలంగాణను అభివృద్ధి చేసి సమస్యలు లేకుండా చేశారని అన్నారు. ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందుతున్నదన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఆసరా పింఛన్లు కనీసం రూ.వెయ్యి కూడా దాట లేదన్నారు. దళితబంధు, బీసీ, మైనార్టీ బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచిత సుఖ ప్రసవాలు, మహిళలకు తక్కువ వడ్డీకే రుణాల వంటి పథకాలు ఏ రాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు. ఓటుకు నోటు దొంగ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీ చేయికాల్చుకున్నదని, తెలంగాణ కమలం వాడిపోయిందన్నారు. బీసీ ముఖ్యమంత్రి అంటున్న బీజేపీ.., రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ వర్గానికి చెందిన బండి సంజయ్‌ని ఎందుకు తప్పించారో ప్రజలకు వివరించాలన్నారు.

### రెడ్యానాయక్ గెలుపునకు కృషి చేస్తా: నూకల నరేశ్‌రెడ్డి

బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి విశేషమైన కృషి చేస్తున్నదని, సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జల్లా సమన్వయ కర్త నూకల నరేశ్‌రెడ్డి అన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలో 40 ఏండ్లుగా ప్రజాజీవితంలో ఉన్న ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తానని, ఇందులో ఎలాంటి అనుమానం అక్కరలేదని హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆగమాగంగా ఉన్న మహబూబాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసి, మెడికల్, ఇంజినీరింగ్, హార్టికల్చర్ కళాశాలలు ఏర్పాటు చేయడంతో సుస్థిరమైన ప్రగతి సాధిస్తున్నదన్నారు.

### ఆదరించండి : ఎమ్మెల్యే రెడ్యానాయక్

డోర్నకల్ నియోజకవర్గ ప్రజలకు 40 ఏండ్లుగా నిత్యం అందుబాటులో ఉండి సేవ చేశానని బీఆర్ఎస్ డోర్నకల్ అభ్యర్థి, ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేశ్ రెడ్డి, రామసహాయం రంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, నియోజకవర్గ శ్రేణులు ఒకే వేదిక మీద, సమష్టిగా ఉండడం తనకెంతో గర్వకారణంగా ఉందని, నిండైన ఆత్మవిశ్వాసం కలిగిందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు సాగునీళ్లు, నాణ్యమైన బోధన, మెరుగైన వైద్యం అందించాలన్నదే తన చిరకాల స్వప్నమన్నారు. మరిపెడను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దినట్లు చెప్పారు. మరిపెడ పట్టణంలో రూ.36 కోట్లతో వంద పకడల దవాఖాన నిర్మించనున్నట్లు తెలిపారు. డోర్నకల్ నియోజవర్గంలో తనపై పోటీ చేసేందుకు అభ్యర్థి లేక కాంగ్రెస్ పార్టీ సూర్యాపేటకు చెందిన డాక్టర్‌ను తీసుకొచ్చిందన్నారు. సూర్యాపేట వైద్యశాలలో డబ్బులు తీసుకుని పనిచేసే డా. రాంచంద్రునాయక్ రోగులకు ఎప్పుడు వైద్యం చేయాలి, నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు సేవ చేయాలన్నారు. గత ఎన్నికల ముందు మరిపెడలో ఉచిత వైద్యం పేర గాంధీ ఆసుపత్రిని నెలకొల్పి పత్తాలేకుండా పోయిన విషయం ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. స్థానికేతరుడికి ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ నూకల వెంకటేశ్వరరెడ్డి, హాకా చైర్మన్ మచ్చ శ్రీనివాస్‌రావు, రాష్ట్ర నాయకులు కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొమ్మనేని రవీందర్, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రవిచంద్ర, ప్రజాప్రతినిధులు గుగులోత్ అరుణారాంబాబు, టేకుల సుశీలాయాదగిరిరెడ్డి, వల్లూరి పద్మావెంకటరెడ్డి, చాపల యాదగిరిరెడ్డి, బండి వెంకటరెడ్డి, కమలారామనాథం, అశోక్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్, కుడితి మహేందర్‌రెడ్డి, గండి మహేశ్, పిట్టల ధనుంజయ, సత్యనారాయణ రెడ్డి, నున్న రమణ, మైదం దేవేందర్, మధుసూదన్‌రెడ్డి, నూకల అభినవ్‌రెడ్డి, అయూబ్ పాషా, సయ్యాద్ లతీఫ్ పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌తోనే రైతులకు లబ్ధి

- మున్నూరుకాపు కులస్తులను గుర్తించి అభివృద్ధి చేసింది కేసీఆరే..
- రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర
- అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే బీఆర్ఎస్‌కే ఓటెయ్యాలి
- ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే శంకర్‌నాయక్

కేసముద్రం, నవంబర్ 8 : సీఎం కేసీఆర్ అధికారంలో ఉంటేనే వ్యవసాయ రంగం అభివృద్ధి చెంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు లబ్ధి చేకూరుతుందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కేసముద్రం మండలం అమినాపురం గ్రామంలోని మున్నూరుకాపు భవన్‌లో బుధవారం జరిగిన మున్నూరుకాపు కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మున్నూరుకాపు కులస్తులు ఎక్కువగా వ్యవసాయం మీదే ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ఒకప్పుడు వీరు పంట పెట్టుబడికి వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి ఇబ్బందిపడేవారని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి వారి బాధలను తీర్చారని అన్నారు. మృతిచెందిన రైతు కుటుంబాలను ఆదుకోవడంలో గత పాలకులు విఫలమయ్యారని, సీఎం కేసీఆర్ రైతుల కుటుంబాలకు రూ.5 లక్షల ప్రమాద బీమా అందించి కొండంత అండగా నిలిచారని అన్నారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులను బలోపేతం చేసి గోదావరి జలాలను విడుదల చేయడంతో భూగర్భ జలాలు పెరిగి పంటలకు పుష్కలంగా నీళ్లు అందుతున్నాయన్నారు. కరోనా వైరస్ కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ సీఎం కేసీఆర్ ఎక్కడా సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వనివిధంగా సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. విదేశాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నాడని తెలిపారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని కులాలకు హైదరాబాద్‌లో భవనాలు నిర్మిస్తున్నారని, మున్నూరుకాపు కులస్తులకు కూడా స్థలం కేటాయించి భవనం నిర్మించినట్లు తెలిపారు. గత పాలకులు మున్నూరు కాపులను విస్మరిస్తే, సీఎం కేసీఆర్ గుర్తించి అవకాశాలు కల్పిస్తున్నాడని అన్నారు. మున్నూరుకాపు కులస్తులు ఐక్యంగా ఉంటూ సీఎం కేసీఆర్‌కు అండగా నిలువాలని కోరారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. మున్నూరు కాపు కులస్తుల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సీఎం కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావాలని కోరారు. మున్నూర్‌కాపు కులస్తులు ఐక్యంగా ఉంటారని, మాట ఇస్తే కట్టుబడి ఉంటారని తెలిపారు. తనను భారీ మెజార్టీతో గెలిపిస్తే పాలేరుగా పని చేస్తానన్నారు. అధికారంలోకి రాగానే రూ.400 గ్యాస్ సిలిండర్, ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా, ప్రతి కుటుంబానికి రూ.15లక్షల పరిమితితో ఆరోగ్యశ్రీ, రైతుబంధు ద్వారా ఎకరానికి రూ.16వేల సహాయం, పేద మహిళలకు నెలకు రూ.3వేలు అందిస్తామన్నారు. అనంతరం ఇనుగుర్తి మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ మున్నూరుకాపు కులస్తులను గుర్తించలేదని, ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కాంగ్రెస్ 4 స్థానాలు, బీజేపీ 4 స్థానాలు కేటాయిస్తే, కేసీఆర్ 10 స్థానాలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకుడు వద్దిరాజు కిషన్, చందా గోపి, కముటం శ్రీనివాస్, మాన్నేని వెంకన్న, చంటి, భద్రాద్రి, పిన్ని రాము, లక్కాకుల సత్యనారాయణ, పూజరి సూరయ్య, ముత్యాల నాగమణి, ఆగె మంజు ల, మామిడి శోభన్‌బాబు, శ్రీనివాస్, ఆగె వెంకన్న , తోట నాగన్న, స్వామి పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

ఇనుగుర్తి మండలంలోని వివిధ పార్టీలకు చెందిన 50 మంది బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ నుంచి చేరిన వారిలో రమావత్ స్వామి, భీమానాయక్, బాటోత్ రాంజీ, రాములు, రమేశ్, పోతుల వెంకటేశ్వర్లు ఉన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు నీలం దుర్గేశ్, సర్పంచ్ రామ్మూర్తి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్‌రెడ్డి, నాయకులు జాటోత్ హరీశ్‌నాయక్, లింగాల పిచ్చయ్య, బేతమల్ల చంద్రయ్య పాల్గొన్నారు.